క్లుప్తంగా

అందుబాటులో జీలుగ, జనుము విత్తనాలు



ఈపూరు: వ్యవసాయ సీజన్ త్వరలో ప్రారంభం కానున్న దృష్ట్యా వ్యవసాయ శాఖ అధికారులు రైతులకు విత్తనాలు అందించేందుకు సిద్ధంగా ఉన్నారు. ఇందులో భాగంగా మొదటి దశగా పచ్చిరొట్ట విత్తనాలు ఆయా రైతు భరోసా కేంద్రాలకు చేరినట్లు మండల వ్యవసాయాధికారి రామారావు శనివారం తెలిపారు. జీలుగ 77 క్వింటాళ్లు, జనుము 87 క్వింటాళ్లు అన్ని రైతు భరోసా కేంద్రాల్లో ఉన్నాయని, ఈ అవకాశాన్ని అందరూ రైతులు వినియోగించుకోవాలని ఆయన తెలిపారు. కావల్సిన వారు పట్టాదారు పాస్‌పుస్తకం, ఆధార్‌కార్డు జిరాక్స్‌తో ఆయా రైతు భరోసా కేంద్రాలకు వచ్చినట్లయితే సిబ్బంది వారికి విత్తనాలు అందజేస్తారని వ్యవసాయ శాఖ అధికారి రామారావు తెలిపారు.

తొంభై శాతం పింఛన్ల పంపిణీ



నాదెండ్ల: మండలంలోని 16 సచివాలయాల పరిధిలో శనివారం వైఎస్సార్ పెన్షన కానుక–సామాజిక భద్రతా పెన్షన్లు సచివాలయ సిబ్బంది 90 శాతం పంపిణీ చేశారు. మండల పరిధిలో 9659 మంది లబ్ధిదారులకు గాను రూ.2,86,49,000లు పెన్షన్ పంపిణీ చేయాల్సి ఉంది. ఇందులో 2440 మందికి గాను పెన్షన్ నగదును వారి బ్యాంకు ఖాతాలకు జమ చేసినట్లు ఎంపీడీవో షేక్ జాకీర్‌హుస్సేన్ తెలిపారు. మిగిలిన 7219 మందికి సచివాలయ సిబ్బంది ఉదయం నుంచి పంపిణీ చేశారు. సుమారు 80 శాతం పైగా పంపిణీ పూర్తి చేసినట్లు ఆయన తెలిపారు.

యడ్లపాడు మండలంలో 144 సెక్షన్ అమలు

యడ్లపాడు: ఎన్నికల కౌంటింగ్ నేపథ్యంలో ప్రకటించిన 144వ సెక్షన్ మండలంలో శనివారం ఉదయం నుంచి పోలీసులు అమలు చేశారు. శాంతి భద్రతల దృష్ట్యా అన్ని రంగాలకు చెందిన వ్యాపార, సేవా సంస్థలు మూసివేయాలని మైకు ప్రచారం చేశారు.


చిన్ననాడే పుస్తక పఠనం అలవర్చుకోండి



నాదెండ్ల: విద్యార్థులు చిన్నతనం నుంచే పుస్తక పఠనాన్ని అలవర్చుకోవాలని నాదెండ్ల శాఖా గ్రంథాలయాధికారి రావూరి శ్రీనివాసరావు చెప్పారు. మండల కేంద్రమైన నాదెండ్ల శాఖా గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరాలను పురస్కరించుకుని శనివారం నూతన పుస్తకాల పరిచయం నిర్వహించారు. చిన్నారులకు పలు రకాల కథల పుస్తకాలు, సైన్స్, గణితం, జనరల్ నాలెడ్జ్ పుస్తకాలను అందించి అందులోని విషయాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు తమ పాఠ్యపుస్తకాలతో పాటూ గ్రంథాలయాల్లోని విషయజ్ఞానాన్ని పెంపొందించే పుస్తకాలను చదవాలని కోరారు.

నిందితులను అరెస్ట్ చేయాలి

క్రోసూరు: యువ న్యాయవాది సంపత్ కుమార్‌ను హత్యచేసిన వారిని వెంటనే అరెస్టు చేయా లని ఎస్సీ ఎస్టీ విజిన్స్ మానిటరింగ్ కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు గార్లపాటి దాసు డిమాండ్ చేశారు. శనివారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ హిందూపురంలోని షెడ్యూల్ కులానికి చెందిన యువ న్యాయవాది సంపత్ కుమార్‌ను మరో న్యాయవాది కృష్ణారెడ్డి స్థల వివాదం నేపథ్యంలో కిడ్నాప్ చేసి, హత్య చేసి చేసినట్లు చెప్పారు. మృత దేహాన్ని ధర్మవరం చెరువు కట్ట పక్కన పడవేసారని ఆరోపించారు. హంతకులు కృష్ణారెడ్డి, అతని కుమారుడు నాగార్జున, వారి అనుచరుల ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి, దోషులను వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు.



నరసరావుపేటలో పంచ ముఖ ఆంజనేయస్వామి



యడ్లపాడులో రణవీరాంజనేయస్వామి



నరసరావుపేటలో పాతూరు వీరాంజనేయ స్వామి



మర్రిచెట్టు పాలెంలోని వీరాంజనేయస్వామి



వినుకొండలో గుంటి ఆంజనేయ స్వామి



విప్పర్లలోని పంచముఖ ఆంజనేయస్వామి



గణపవరం వీరాంజనేయ స్వామి



ఎండుగుంపాలెంలో స్వామివారు



చిలకలూరిపేటలో మామిడిపండ్లతో..



కొత్తపల్లిలో సంజీవ ఆంజనేయస్వామి

వైభవంగా హనుమజ్జయంతి వేడుకలు

నరసరావుపేట ఈస్ట్: హనుమజ్జయంతిని పురస్కరించుకొని పట్టణంలోని హనుమాన్ ఆలయాలు భక్తజనులతో కిటకిటలాడాయి. ఉదయం నుంచి ఆయా ఆలయాలలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయాలల్లో స్వామి వారికి మామిడి పండ్లు, తమలపాకులు, విసనకర్రలతో పూజలు జరిపారు. పాతూరులోని శ్రీమదట్లూరి వీరాంజనేయస్వామి ఆలయంలో స్వామి వారిని చందనం, డ్రైఫ్రూట్స్‌తో అలంకరించారు. అలాగే సత్తెనపల్లి రోడ్డులోని అయ్యప్పస్వామి ఆలయంలో వేంచేసి ఉన్న శ్రీ పంచముఖ ఆంజనేయస్వామి, పాలపాడు రోడ్డులోని శ్రీ చిన్నసింగరకొండ ప్రసన్నాంజనేయ స్వామి ఆలయం, బరంపేటలోని ప్రసన్నాంజనేయ స్వామి ఆలయం, అరండల్‌పేటలోని వీరాంజనేయ స్వామి ఆలయం, స్టేషన్ రోడ్డులోని భక్తాంజనేయ స్వామి వారి ఆలయాలలో భక్తులు పూజలు నిర్వహించారు. ఆయా ఆలయాలలో భక్తులకు మామిడి కాయలు, విసనకర్రలు, అన్నప్రసాద వితరణ నిర్వహించారు. డ్రగ్స్ అండ్ కెమిస్ట్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి కె.పి.రంగారావు, శ్రీవాసవి మిత్రమండలి అధ్యక్షుడు చేగు వెంకటేశ్వరరావు, నాగసరపు అనూరాధ, కొత్తమాసు సుధాకర్‌రావు తదితరులు భక్తులకు ప్రసాద వితరణ నిర్వహించారు.

రొంపిచర్ల: మండలంలోని అన్ని గ్రామాల్లో శనివారం హనుమజ్జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. మండలంలో కొత్తపల్లి డొంక వద్దగల శ్రీ సంజీవ ఆంజనేయస్వామి, విప్పర్ల శివాలయంలో వేంచేసియున్న పంచముఖ ఆంజనేయస్వామి, మర్రి చెట్టుపాలెం గ్రామంలో గల శ్రీ వీరాంజనేయ స్వామివారి ఆలయాలలో, స్థానిక చెరువుకట్ట సెంటర్లో గల శ్రీ అభయాంజనేయస్వామివారి విగ్రహం, స్థానిక శ్రీ షిర్డీ సాయిబాబా ఆలయ ఆవరణలో గల శ్రీ అభయాంజనేయస్వామివారి విగ్రహం వద్ద హనుమాన్ జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రాతఃకాలంలో అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. ఆలయాల వద్దకు వచ్చిన భక్తులకు ఆలయాల పూజార్లు హనుమాన్ జయంతి వేడుకల విశిష్టత గురించి వివరించారు. ఈ సందర్భంగా భక్తులకు మామిడి పండ్లు, విసనకర్రలు పంపిణీ చేశారు. కొన్ని గ్రామాలలో హనుమాన్ జయంతి వేడుకలను పురస్కరించుకుని భారీ అన్నదాన కార్యక్రమాలు జరిగాయి.

శావల్యాపురం: మండలంలోని కనమర్లపూడి, కారుమంచి, వేల్పూరు, పోట్లూరు, మతుకుమల్లి,శావల్యాపురం తదితర గ్రామాల్లో హనుమజ్జయంతి వేడుకలు భక్తులు అత్యంత భక్తి శ్రద్ధలతో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా శావల్యాపురంలో వేంచేసియున్న శ్రీప్రసన్నాంజనేయ స్వామి దేవాలయంలో స్వామి వారి మూల విరాట్‌కు పాలాభిషేకంతో పాటు ఆలయ పూజారీ రావిపాటి సాయి భరత్ సారథ్యంలో ఘనంగా విశేష పూజలు దంపతులచే అర్చనలు అభిషేకాలు ఆకు పూజ కార్యక్రమాలు వైభవంగా నిర్వహించారు. స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరణ చేశారు.



కోదండరామాలయంలో మన్యుసూక్త సహిత రుద్రహోమంలో భక్తులు



వినుకొండ రంగనాయక స్వామి గుడి ఆవరణలో హనుమాన్ చాలీసా



శావల్యాపురంలో ప్రత్యేక పూజల్లో పాల్గొన్న భక్తులు

యడ్లపాడు: మండలంలోని పలు ఆలయాల్లో హనుమజ్జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. పోలీసులు విధించిన 144 సెక్షన్‌ను అనుసరిస్తూ స్వామి వారి జయంతి వేడుకలు అంతటా భక్తులు పరిమిత సంఖ్యలో జరిగాయి. యడ్లపాడు రణవీరాంజనేయస్వామి ఆలయంలో స్వామివారికి భారీ అలంకరణ చేశారు. అభిషేకాలు, ఆకుపూజలు ఆలయ అర్చకులు జంధ్యాల శ్రీరామచంద్రమూర్తి ఆధ్వర్యంలో జరిగాయి. కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా భక్తులకు పలు రకాల ప్రసాదాలను పంపిణీ చేశారు. బోయపాలెం సీతారామస్వామి దేవస్థానం, హరిహర క్షేత్రంలోని ఆంజనేయస్వామి ఉపాలయం, చెంఘీజ్‌ఖాన్‌పేటలోని రామాలయం, జాలాది హరిహర దత్త క్షేత్రం, తిమ్మాపురం ఆంజనేయస్వామి గుడిలోనూ ఆలయ అర్చకులు, ధర్మకర్తలతో మాత్రమే జయంతి వేడుకలు పరిమితంగా జరిగాయి.

నాదెండ్ల: హనుమజ్జయంతిని పురస్కరించుకుని మండలంలోని అన్ని గ్రామాల్లో గల ఆంజనేయ స్వామి ఆలయాలు, కోదండరామాలయాల్లో వేడుకలు ఘనంగా నిర్వహించారు. గురువారం నుండి ప్రారంభమైన జయంతి వేడుకలు శనివారంతో ముగిశాయి. గణపవరం–కావూరు డొంక రోడ్డులో కొలువైయున్న శ్రీ వీరాంజనేయస్వామి ఆలయంలో స్వామివారిని అలంకరించి పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఆలయ పూజారులు లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో సువర్చలా సమేత వీరాంజనేయస్వామికి కల్యాణం నిర్వహించారు. మామిడి పండ్లతో అభిషేకాలు నిర్వహించి విసన కర్రలు ప్రసాదాలు పంపిణీ చేశారు. కార్యక్రమాలను ఆలయ కమిటీఅధ్యక్ష కార్యదర్శులు కాట్రు శ్రీనివాసరావు, ఆదిపూడి మల్లిఖార్జునరావు, కమిటీ సభ్యులు పర్యవేక్షించారు. గణపవరంలో నూతన కోదండ రామాలయంలో 1200 మామిడి పండ్లు, 1200 తమల పాకులతో అభిషేకాలు, గోత్రనామ పూజలు నిర్వహించారు. పూజారులు దర్బి ఉమామహేశ్వరశర్మ, అనిల్‌కుమార్ ఆధ్వర్యంలో హోమం నిర్వహించారు. కార్యక్రమాలను ఆలయ కమిటీ అధ్యక్షులు వలేటి వెంకటేశ్వరరావు, గౌరవ అధ్యక్షులు కెల్లంపల్లి సుందరరావు, కమిటీ సభ్యులు పర్యవేక్షించారు. ప్రసాదాలు పంపిణీ చేశారు. శాంతినగర్ కోదండరామాలయంలో, ఎండుగుంపాలెంలోని అక్కాయకుంట సువర్చలాసమేత ప్రసన్నాంజనేయస్వామి ఆలయంలో స్వామివార్లకు పూజలు నిర్వహించి అన్నదానం చేశారు. కార్యక్రమాలను ఆలయ కమిటీ సభ్యులు పర్యవేక్షించారు. భక్తులకు మామిడి పండ్లు పంపిణీ చేశారు.

వినుకొండ(నూజెండ్ల): హనుమజ్జయంతి వేడుకలను వినుకొండ పట్టణం, మండలంలో శనివారం ఘనంగా నిర్వహించారు. మండలంలోని విఠంరాజుపల్లి గ్రామం వద్ద గల సాయి బృందావనం (చిన్నషిరిడీ)లో శాంతి ఆశ్రమ ట్రస్ట్ ఆధ్వర్యంలో అఖండ జ్యోతి ప్రదాత హిమాలయ గురూజీ ఆధ్వర్యంలో ఆంజనేయ స్వామి మూలవిరాట్‌కు అభిషేకాలు, లక్ష తమలపాకులతో ఆంజనేయస్వామి వారికి అర్చన, పుష్పాభిషేకం, విశేషహారతులు చేపట్టారు. అనంతరం భక్తులకు అన్నదాన వితరణ చేశారు. హనుమాన్ చాలీసా పారాయణం, హనుమత్ బీజాక్షర హోమ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ నిర్వాహకులు పెండేల వెంకట మోహన్‌రావు, పెండేల వెంకట పుల్లారావు, కనిగండ్ల కోటేశ్వరరావు, కొప్పురావూరి సుధాకర్, సురేష్, స్వామి, మునిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శ్రీ గుంటి ఆంజేయస్వామి దేవాలయంలో....

పట్టణంలోని శ్రీ గుంటి ఆంజనేయ స్వామి 44వ వార్షికోత్సవం, హనుమాన్ జయంతి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. మూడు రోజులుగా జరుగుతున్న ఉత్సవాల్లో స్వామి వారికి ప్రత్యేక పూజలు, అష్టోత్తర శత కలశ అభిషేక స్నాపన, తిరుమంజనం, హోమాలు, విశేష పూజా కార్యక్రమాలు నిర్వహించారు. హనుమాన్ జయంతి సందర్భంగా అర్చకులు శ్రీమన్నారాయణ ఆనందచార్యులు, జయచంద్, ఆలయ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో స్వామివారికి పంచామృత అభిషేకాలు, విశేష అర్చనలు, హనుమత్ వ్రత మహోత్సవాలు చేపట్టారు. అనంతరం అన్నప్రసాద వితరణ చేశారు.

రంగనాయకస్వామి గుడి ఆవరణలో

పట్టణంలోని తూర్పు బజార్ రంగనాయక స్వామి గుడి ఆవరణలో వెలసి ఉన్న శ్రీ వీరాంజనేయస్వామి జయంతి సందర్భంగా మహిళా భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని హనుమాన్ చాలీసా పారాయణం నిర్వహించారు. స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి అన్న సంతర్పణ చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రసాద్, రామకోటయ్య, సుబ్బారావు, మల్లికార్జునరావు, అర్చకులు పి.సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.



ప్రత్యేక అలంకరణలో రొంపిచర్ల చెరువుకట్ట సెంటర్లోని అభయాంజనేయ స్వామి

పారిశుద్ధ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలి

మున్సిపల్ కమిషనరు చింతా రవిచంద్రారెడ్డి

నరసరావుపేట: పట్టణంలోని వీధుల్లో పారిశుద్ధ్యంపై సచివాలయ శానిటేషన్ సెక్రటరీలు ప్రత్యేక శ్రద్ధ వహించి పనిచేయాలని మున్సిపల్ కమిషనరు చింతా రవిచంద్రా రెడ్డి పేర్కొన్నారు. శనివారం పట్టణంలోని 25వార్డు పెద్ద చెరువు, 32వ వార్డు బరంపేట సీసాల బజారు, మిట్టబజార్ పరిసర ప్రాంతాల్లో పర్యటించారు. వీధుల్లో పారిశుద్ధ్యం పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వార్డు పరిసర ప్రాంతాల్లో పాదచారులు, వాహనదారులకు పెరిగిన పిచ్చి మొక్కలు, చెట్లను అడ్డంలేకుండా తొలగించాలన్నారు. డోర్ టు డోర్ గార్బేజ్ కలెక్షన్ ప్రతిరోజు చేసే విధంగా, కాలువలు శుభ్రంగా ఉండేవిధంగా చేసుకోవాలని కోరారు. కాలువలు శుభ్రం చేయడంలో వాటిపై ఏ విధమైన అక్రమణలు ఉన్నా సంబంధిత టౌన్ ప్లానింగ్ ఆఫీసర్‌కు తెలియచేస్తే వారు వాటిని తొలగిస్తారన్నారు. కనుక ప్రతి ఒక్కరు వార్డులోని సమస్యలను నోట్ చేసుకొని సంబంధిత టౌన్ ప్లానింగ్ ఆఫీసర్‌కు తెలియజేయాలని సూచించారు. ప్రతి సెక్రటరీ తమ వార్డులో చేసేటటువంటి పనులకు సంబంధించి బిఫోర్, ఆఫ్టర్ ఫోటోలు తీసి పంపించాలని ఆదేశించారు. టౌన్ ప్లానింగ్ ఆఫీసర్ నరసింహారావు, మున్సిపల్ అసిస్టెంట్ ఇంజనీర్ రాములు నాయక్, శానిటేషన్ ఇనస్పెక్టర్లు రామకోటయ్య, వెంకటేశ్వర్లు, సచివాలయ సెక్రటరీలు పాల్గొన్నారు



పారిశుద్ధ్యంపై సూచనలు చేస్తున్న కమిషనరు

లెక్కింపునకు అందరూ సహకరించాలి

- తహసీల్దారు నక్కా లక్ష్మి లావణ్య
- 6 వరకు వ్యాపార సంస్థలు మూతవేయాలి

శావల్యాపురం: సార్వత్రిక ఎన్నికల ఓట్లు లెక్కింపు ప్రశాంతమైన వాతావరణంలో జరిగేలా అందరూ సహకరించాలని తహసీల్దారు నక్కా లక్ష్మి లావణ్య అన్నారు. శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎన్నికల ఓట్లు లెక్కింపు సందర్భంగా వీఆర్వోలు, పంచాయతీ కార్యదర్శులు, మహిళా పోలీసులు, వివిధ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దారు మాట్లాడుతూ జిల్లా కలెక్టరు ఆదేశాల మేరకు అన్నీ గ్రామాల్లో నేటి నుంచి 6వ తేదీ వరకు వ్యాపార సంస్థలు అన్నీ మూసి వేయాలన్నారు. జిల్లాలో 144 సెక్షన్ అమల్లో ఉందని తద్వారా ఓట్ల లెక్కింపు పురస్కరించుకుని శాంతి భద్రతలకు విఘాతం కలుగకుండా ప్రజలందరూ తమవంతు సహకరించాలన్నారు.

అత్యవసరమైన పాలు, పెరుగు, కూరగాయలు, మెడికల్ దుకాణాలు మినహాయించి మిగిలిన వ్యాపార సముదాయాలన్నీ పూర్తిస్థాయిలో మూత వేయాలన్నారు. రోడ్లపై ప్రజలు గుంపులుగా ఉండరాదన్నారు. ఎస్సై చల్లా సురేష్ మాట్లాడుతూ ఓట్లు లెక్కింపు ప్రక్రియ పూర్తి కాగానే బాణా సంచా టపాసులు తదితరవన్నీ కాల్చరాదన్నారు.

సోషల్ మీడియాలో రాజకీయ పార్టీల మధ్య విద్వేషాలు రెచ్చగొట్టే విధంగా వీడియోలు, ఫోటోలు, సందేశాలు పోస్టులు చేసిన వారిపై చట్టపరంగా కేసులు నమోదు చేస్తామన్నారు. ఆమెతోపాటు ఎంపీడీవో కొర్రపాటి కవితా చౌదరి తదితరులు పాల్గొన్నారు.



సదస్సులో పాల్గొన్న అధికారులు

కూలీలకు పని ప్రదేశాల్లో సౌకర్యాలు కల్పించాలి

అమరావతి: ఉపాధి హామీ పని ప్రదేశంలో ప్రథమ చికిత్స కిట్లు ఉండే విధంగా అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని వ్యవసాయ కార్మిక సంఘం పల్నాడు జిల్లా కార్యదర్శి రవి బాబు పేర్కొన్నారు. శనివారం మండల పరిధిలోని మునుగోడులో ఉపాధి హామీ కూలీలతో ఆయన మాట్లాడారు. పని ప్రదేశంలో ప్రథమ చికిత్స బాక్సులు ఉండటం లేదన్నారు. ఐదు వారాల వేతనాలు రావాల్సి ఉందని, పెండింగ్ వేతనాలు వచ్చే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు.

పని దినాలు 200లకు పెంపుతో పాటుగా ఇతర డిమాండ్లను సాధించుకోవడానికి కూలీలందరూ ఐక్యమత్యంతో కృషి చేయాలని కోరారు. వంద రోజు లు పూర్తి చేసిన ప్రతి ఉపాధి హామీ కూలీకి కావల్సిన గడ్డ పలుగు, పారలను సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు సయ్యద్ మొహిద్దీన్, పరమేశ్వరరావు పాల్గొన్నారు.

పోస్టల్ బ్యాలెట్ లెక్కింపునకు ప్రత్యేక గది

సత్తెనపల్లి: సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపునకు సమయం ఆసన్నమైంది. పోస్టల్ బ్యాలెట్ ఓట్లను లెక్కించేందుకు ప్రత్యేక గదిని కేటాయించారు. ఇందుకు ప్రతి రాజకీయ పార్టీ తరపున ఐదు నుంచి ఆరుగురి వరకు ఏజెంట్లను అనుమతించనున్నారు. ఈ దఫా ఎన్నికల్లో అధికంగా ఉద్యోగులు 1,926 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. వీరు కాక ఇతర జిల్లాలకు చెందిన వారు 288 మంది పోస్టల్ బ్యాలెట్ ఓట్లు ఆర్వో కార్యాలయానికి చేరుకున్నాయి. వృద్ధులు, పోలింగ్ కేంద్రానికి రాలేని దివ్యాంగులు 255 మంది ఈ అవకాశాన్ని వినియోగించుకున్నారు.

రక్షణ రంగానికి సంబంధించిన సర్వీస్ ఓటర్లు 281 మంది ఉండగా.. ఇప్పటి వరకు 86 మందికి చెందిన పోస్టల్ బ్యాలెట్లు ఆర్వో కార్యాలయానికి చేరుకున్నాయి. అయితే ఈ నెల 4 ఉదయం 7.59 గంటల వరకు వీరికి అవకాశం ఉంది.